ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.3, కనిష్ఠం 27.7
ఆదిలాబాద్
జిల్లా వార్తలు

గురువారం 22 మే 2025



ఆయా పోలీసు స్టేషన్ల ఎస్సైలను వివరాలు అడుగుతున్న ఎస్పీ



● జైనథ్‌లోని కొనుగోలు కేంద్రంలో పాలిథిన్ కవర్లను కప్పి ఉంచిన జొన్న కుప్పలు

- జిల్లాలో రైతులను ఆగం చేస్తున్న అకాల వర్షాలు
- చెడగొట్టు వానలతో తప్పని తిప్పలు
- కొనుగోలు కేంద్రాలలో తడిసిన జొన్న పంట
- లారీల కొరతతో నిలిచిపోతున్న జొన్నల తరలింపు
- రోజుల తరబడి పంట కుప్పల వద్దనే పడిగాపులు
- జిల్లావ్యాప్తంగా ఈ సీజన్‌లో లక్షా 9వేల ఎకరాలలో సాగైన జొన్న పంట

అన్నదాత.. అతలాకుతలం!

ఆదిలాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): అష్టకష్టాలు పడి పటలను పండించి.. అమ్ముకునేందుకు అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు. అధికారులకు ముందుచూపు లేకపోవడంతో యేటా పంట కొనుగోళ్లలో జాప్యం జరుగుతూనే ఉంది. ముఖ్యంగా యాసంగి పంటల కొనుగోలు సమయంలో తీవ్రమైన ఎండలు, అకాల వర్షాలతో అన్నదాతలు అతలాకుతమవుతున్నారు. ఈ సారి యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా లక్షా 9వేల ఎకరాలలో జొన్న పంట సాగయ్యింది. దీంతో 11 లక్షల క్వింటాళ్లకు పైగా దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో ఎకరాన 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం ఎకరాన 14 క్వింటాళ్ల జొన్నలను మాత్రమే కొనుగోలు చేస్తుంది. మిగిలిన పంట ది గుబడులను దళారులకు అమ్మేసుకుంటూ రైతులు నష్టపోతున్నారు. గత నెల రోజులుగా జొన్న కొనుగోలు జరుపుతున్న కొనుగోలు ప్రక్రియ వేగవంతం కాకపోవడంతో రోజుల తరబడి కొనుగోలు కేంద్రాలలోనే రైతులు పడిగాపులు కాస్తున్నారు.



● జైనథ్ మండలం మేడిగూడలో జొన్న పంట కొనుగోలు కోసం ఎదురు చూస్తున్న రైతులు



● బేల మార్కెట్‌యార్డులో తడిసిపోయిన జొన్న బస్తాలు

కష్టమంతా నీళ్లపాలు

జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాలలో జొన్న పంట తడిసి ముద్దవుతోంది. బుధవారం కురిసిన భారీ వర్షానికి బేల, జైనథ్, ఇచ్చోడ, సిరికొండ, తాంసి, ఆదిలాబాద్ కొనుగోలు కేంద్రాలలో జొన్నలు తడిసి పోయినట్లు అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి 6లక్షల క్వింటాళ్లను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఇప్పటి వరకు 4 లక్షల క్వింటాళ్లకు పైగా కొనుగోలు చేసినట్లు అ ధికారులు చెబుతున్నారు. మే ఆఖరి వరకు జొన్న కొనుగోళ్లను పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. కానీ ఇలాంటి పరిస్థితులలో సాధ్యమయ్యే పని కాదన్న

(తరువాయి 6వ పేజీలో...)

జొన్నలను మార్కెట్‌కు తెచ్చి వారం రోజులు అవుతోంది

: రవికిరణ్, రైతు, బేల మండలం



జొన్నలను మార్కెట్‌కు తెచ్చి వారం రోజులు గడుస్తోంది. ఇప్పటికీ కొనుగోలు చేయడం లేదు. కొంతమంది రైతుల జొన్నలను కాంటాలు వేసినా.. గోదాంలకు తరలించడం లేదు. దీంతో అకాల వర్షాలకు జొన్న బస్తాలు తడిసి పోతున్నాయి. బస్తాలను తరలించేంత వరకు రైతులదే బాధ్యత అంటున్నారు. ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి. మార్కెట్ యార్డుల్లో పంటను నిల్వ చేసుకునేందుకు అవకాశం లేకపోవడంతో పాలిథిన్ కవర్లని కప్పి ఉంచాల్సిన పరిస్థితి ఉంది.

పోత సంచులు లేక తీవ్ర ఇబ్బందులు

: ఆవుల రమేష్, రైతు, తోయిగూడ



జైనథ్ ఉమ్మడి పరిధిలోని సాత్నాల మండల పరిధిలో గల మేడిగూడ (ఆర్) ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రంలో చేపడుతున్న అంశంలో పోతలు బర్దన్ కొరత కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఈ వారంలో వర్షాకాలానికి సంబంధించిన మా పంట పొలాలను శుద్ధి చేసుకుంటున్నాం. తాము పండించిన జొన్న పంటను ప్రభుత్వ ఎప్పుడు? ఎలా? కొనుగోలు చేస్తుందోన్న దానిపై ఆందోళనకు గురవుతున్నాం.

పెండింగ్ కేసుల దర్యాప్తును సమర్థవంతంగా పూర్తి చేయాలి : ఎస్పీ

ఉట్నూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులపై ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సబ్ డివిజన్ పోలీసు ఆఫీసులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దాదాపు 200 కేసులను పూర్తి చేసే దిశగా కార్యచరణ చేశారు. వివిధ, చిన్న కారణాలతో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును పూర్తి చేసి బాధితులకు త్వరగా న్యాయం చేయాలని అన్నారు. సబ్ డివిజనల్ పోలీసు అధికారులో, సిబ్బందితో ఒక రోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సబ్ డివిజనల్ పరిధిలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను త్వరగా పూర్తి చేసి బాధితులకు సరైన సమయంలో న్యాయం చేకూర్చే విధంగా కృషి చేయడానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేక కార్యాచరణను రూపొందించారు. ఈ సందర్భంగా వాటిని అవలంభించే దిశగా మొదటి అడుగుగా ఉట్నూర్ సబ్ డివజినల్ పరిధిలో ఉన్న మూడు సర్కిల్ ఆఫీసులు, 8 పోలీసు స్టేషన్‌ల పరిధిలో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలోని దాదాపు 200 కేసులను పరిష్కరించే దిశగా ఆదేశాలను జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులలో ఎంవీఐ రిపోర్టులు, పీఎంపీ రిపోర్టులు, అగ్రికల్చర్ కార్యాలయం ఉన్న రిపోర్టులు, వెటర్నరి కార్యాలయంలో ఉన్న రిపోర్టులను సాధ్యమైనంత త్వరా తీసుకొని దర్యాప్తు పూర్తి చేసి పెండింగ్ కేసులు పూర్తి చేయాలని సూచించారు. బాధితుల కేసులను దర్యాప్తు పూర్తి చేసి నేరస్థులకు శిక్షలు పడినప్పుడు సరైన న్యాయం చేకూరుతుందని అన్నారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ వారీగా పెండింగ్‌లో ఉన్న ఒక్కొక్క కేసు వివరాలను క్షుణంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రతీఒక్క పోలీసు స్టేషన్ అధికారికి స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా దర్యాప్తును పూర్తి చేయాలని ఆదేశాలను జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, సీఐలు గండికోట మొగిలి, రహీంపాషా, సబ్ డివిజన్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది రైటర్లు, తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

గుడిహత్నూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని వ్యవసాయ పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త రాంప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని మన్నూర్‌లో రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలకు తెలుపు, నలుపు, గులాబీ రంగు పురుగుల నివారణకు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏవో రమేష్ మాట్లాడుతూ రైతులు విత్తనాలు ఎరువులు కొనుగోలు చేసినప్పుడు షాపుల్లో రసీదులు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త ప్రవీణ్ కుమార్, పీఏసిఎస్ చైర్మన్ కరాడ్ ప్రకాష్, మాజీ ఎంపీపీ కేంద్రే జ్ఞానోభా, ఏఈవో వంశీ, పెద్దసంఖ్యలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత

తాంసి, మే 21(ఆంధ్రజ్యోతి): అడవుల రక్షణ అందరి బాధ్యతగా తీసుకున్నప్పుడే వాతావరణంలోని కాలుష్యాన్ని అరికట్టవచ్చని అటవీ శాఖ అధికారి అహ్మద్‌ఖాన్ అన్నారు. బుధవారం మండలంలోని అట్నంగూడా, లింబుగూడ, గిరిగావ్ అటవీ ప్రాంతాల్లో నివాసముండే గిరిజనులకు చెట్ల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లు ఉన్నప్పుడే వాతావరణంలోని కాలుష్యాన్ని అరికట్టవచ్చన్నారు. అడవులు ఉంటేనే సమృద్ధిగా వర్షాలు కురుస్తాయి అన్న విషయాన్ని గ్రహించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చెట్లను నరికితే కఠిన చర్యలు తప్పవని సూచించారు. వన్య ప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత కూడా అందరిపై ఉందన్నారు. మండలంలోని ఏ ప్రాంతంలో కూడా చిరుత గాని, పెద్దపులి గాని సంచరించడం లేదని, ఇప్పటి వరకు ఎలాంటి నష్టం కూడా కలగలేదని అన్నారు. ఎవరైనా చెట్లు నరికినా.. వన్యప్రాణులను వేటాడినా.. సమాచారం అందించాలని కోరారు. కొత్త వ్యక్తులు కనుక అటవీ ప్రాంతాల్లో సంచరించినట్లయితే తెలపాలన్నారు. ఈ సందర్భంగా అడవుల విషయాలపై అవగాహన కల్పించారు.

విద్యార్థులు ఉన్నత విద్య వైపు దృష్టి సారించాలి : ఖానాపూర్ ఎమ్మెల్యే

ఉట్నూర్, మే21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని, విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని కొమురంభీం ఆదివాసీ భవనంలో బంజారాహిల్స్‌లో నిర్వహించిన అకాడమిక్ సక్సెస్ మీట్‌లో మంత్రి సీతక్కతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీఒక్క విద్యార్థి ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో విద్య వ్యవస్థను బలోపేతం చేయడం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. విద్యార్థులు పట్టుదలతో చదవాలని, చదువుతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. అధికారులు పాఠశాలలో ఉత్తీర్ణత శాతం తగ్గకుండా చూడాలని సూచించారు. హైదరాబాద్ కేంద్రంగా సక్సెస్ మీట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం మంత్రితో కలిసి ఇటీవల టెన్త్, ఇంటర్, ఎంసెట్, జేఈఈ మెయిన్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించారు.

రెండు రోజుల పాటు జొన్న పంట కొనుగోళ్ల నిలిపివేత

బోథ్, మే 21 (ఆంధ్రజ్యోతి): మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన జొన్న పంట కొనుగోలు ఈనెల 22, 23వ తేదీలలో నిలిపివేస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి తెలిపారు. వాతావరణ పరిస్థితి అనుకూలంగా లేనందున ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. తిరిగి 24న పంట కొనుగోలు చేపడతామన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి పంటను మార్కెట్‌కు తీసుకురావద్దని సూచించారు.

జొన్నల తరలింపునకు లారీల కొరత

బోథ్, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న జొన్న పంటను తరలించేందుకు లారీలు దొరకకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. బోథ్, సోనాల, నేరడిగొండ మండల కేంద్రాల్లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు జరుగుతున్నాయి. అయితే కొనుగోలు చేసిన జొన్న పంట లారీలలో తరలిస్తున్నారు. అయితే జిల్లావ్యాప్తంగా పంట కొనుగోలు ఒకేసారి జరగడం.. అందుకు తగ్గట్టుగా జొన్న పంటను గోడౌన్లకు తరలించేందుకు అవసరమైన లారీలు లభించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని అధికారులు అంటున్నారు. మరోవైపు వర్షాలు కురుస్తుండడంతో జొన్న రైతులు ఆందోళన చెందుతున్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎంపీడీవో గంగాసింగ్

ఇందిరమ్మ ఇంటి కోసం నిరసన

నార్నూర్ రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు గ్రామస్థులు అభిప్రాయం తీసుకోకుండా వారి చుట్టాలు, ప్రభుత్వ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్‌లా పని చేస్తున్న వారికి పేర్లను సిఫార్స్ చేసి గ్రామం వద్ద గొడవలకు దారి తీసేలా చేశారని బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద మహిళలు నిరసన చేపట్టారు. సంబంధిత అంశాలపై ఎంపీడీవోను గంగాసింగ్ నిలదీశారు. వెంటనే మంజూరు చేసిన లబ్ధిదారుల జాబితాను రద్దు చేయాలన్నారు. కొత్తగా గ్రామసభ పెట్టి వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళా, ఇల్లు లేని నీరు పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ ముడు సార్లు భారీ ఎత్తున్న ధర్నా చేసినా.. కలెక్టర్‌కు కలిసిన తమలాంటి పేద వారిని పట్టించుకోవడం లేదంటూ వాపోయారు. ఎస్సీలో ఐకేపీ అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న వారికి కూడా మంజూరు చేయడంపై భారీ ఎత్తున్న అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కాగా, ఈ విషయంపై ఎంపీడీవో జిల్లా పరిషత్ సీఈవోకు మహిళలతో మాట్లాడించారు. దీంతో మహిళలు తమకు ఇళ్లు కావాలని పట్టుబట్టారు. కార్యక్రమంలో ఆమ్రపాలి జాడే, పద్మ చునర్కార్ , రోష్ని దుర్గే, విజయ మస్కే, తదితరులు పాల్గొన్నారు.

● ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

తాంసి: మండలంలోని హసనాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను బుధవారం అధికారులు పరిశీలించారు. గ్రామంలో ప్రస్తుతం 63 ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యాయి. కాగా, ఈ ఇళ్ల నిర్మాణాలు ఏ మేరకు నడుస్తున్నాయో సంబంధిత గ్రామ కార్యదర్శి లావణ్య లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.

ఉపాధి పనులు పూర్తయ్యేలా చర్యలు

● జిల్లా కలెక్టర్ రాజర్షి షా ● ఆదిలాబాద్ మండలంలో సుడిగాలి పర్యటన ● అడవిలో ద్విచక్ర వాహనంపై పయనించిన కలెక్టర్



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్



చిట్యాల బోరి నుంచి అటవీ ప్రాంతంలోకి బైక్‌పై వెళ్తూ..

ఆదిలాబాద్ టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జరుగుతున్న ఉపాధి హామీ పనులు సక్రమంగా పూర్తయ్యేలా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. ఆదిలాబాద్ గ్రామీణ మండల పరిధిలో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. మండలంలోని పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటనలు జరిపి ఉపాధి హామీ పనుల తీరును పర్యవేక్షించారు. చిట్యాల బోరి నుంచి ఉపాధి పనులు జరుపుతున్న అడవిలోకి దాదాపు రెండు కిలోమీటర్ల మేర బైక్ పై ప్రయాణించారు. ఉపాధి హామీ కూలీల సంఖ్య, పని ప్రదేశానికి చేరుకునే సమయం, పనులు ఎప్పటి నుంచి చేస్తున్నారు వంటి వివరాలను అడిగి తెలుసుకుని పనుల నాణ్యతను పరిశీలించారు. ఉపాధి హామీ పనులు సక్రమంగా జరగడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం తగ్గుతుందని, ప్రజల జీవనోపాధి మెరుగుపడుతుందన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించి మొక్కల సంరక్షణపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ ఏడాది సాధ్యమైనంతా తొందరగా మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా కచికంటి లోని అంగన్‌వాడీ కేంద్రం లో నిర్మిస్తున్న టాయిలెట్స్ నిర్మాణ పనులు పరిశీలించారు. గ్రామంలోని ఓ ఇంట్లో వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణ పనులు పరిశీలించారు. ఇంకుడు గుంతల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. భూగర్భ జల మట్టం పెరుగడంతోపాటు బోర్లు ఎండిపోకుండా ఉంటాయని, వర్షపు నీరు వృధా కాకుండా ఉంటుందని తెలిపారు. ఇంటి ఆవరణలో, బోరు బావికి దెగ్గరగా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం యాపల్‌గూడలోని రామాలయం ఆవరణలో ఎస్‌బీఎం నిధులతో నిర్మించిన కమ్యూనిటీ టాయిలెట్‌ను పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఓ రవీందర్, ఎంపీడీఓ నాగేశ్వర్ రావు, సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో పలుచోట్ల అకాలవర్షం

● తలమడుగు మండల కార్యాలయంలో నిలిచిన వర్షపునీరు ● రోడ్లన్నీ జలమయం ● బోథ్‌లో చిరుజల్లులకు వణికిన జొన్నరైతు ● తాంసి మండలంలో కురిసిన భారీ వర్షం ● జైనథ్‌లో జొన్నరైతులకు తప్పని తిప్పలు

తలమడుగు, మే 21(ఆంధ్రజ్యోతి): తలమడుగు మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారీగా వర్షపు నీరు నిలవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రభుత్వ కార్యాలయంలోనే ఇలా వర్షపు నీరు నిలిచిపోతే పట్టించుకోనే వారు లేకపోతే ఇక గ్రామీణ ప్రాంతాల పరిస్థితి ఇలా ఉంటుందని మండలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నట్టుండి మధ్యాహ్నం కురిసిన వర్షంతో వ్యవసాయ పనులకు వెళ్లిన కూలీలు మేత కోసం వెళ్ళిన పశువులు తడిసి ముద్దయ్యాయి. కొంతమంది రైతుల వ్యవసాయ పొలాల్లో మిగిలిన జొన్నలు సైతం తడిసిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఖరీఫ్ సాగు సమీపిస్తూ ఉండడంతో కురిసిన వర్షానికి రైతులు పంట పొలాల్లో వేసవి దిక్కులు, పంటల చదును చేసేందుకు వేగవంతంగా పనులు చేపడుతున్నారు.

బోథ్: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జొన్న పంట కొనుగోలు కొనసాగుతున్నాయి. అయితే బుధవారం తెల్లవారుజామున చిరుజల్లులు కురవడంతో మార్కెట్లో ఉన్న రైతులు ఆందోళనకు గురయ్యారు. చిరుజల్లు కురవడం వల్ల తమ పంటలను వర్షం నుంచి కాపాడుకునేందుకు అందుబాటులో ఉన్న టార్పాలీన్ కవర్లను పంట తడవకుండా కప్పి ఉంచారు. ఏది ఏమైనా జొన్న పంట పండించడం ఒక ఎత్తు అయితే అమ్ముకోవడం మరో ఎత్తుగా మారిందని పలువురు రైతులు వాపోతున్నారు.

తాంసి: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు మెరుపులు ఈదురు గాలులతో కూడిన వర్షం వల్ల జొన్న రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడక్కడ చెట్లు రోడ్లపై పడ్డాయి. పూరి గుడిసెల పైకప్పులు లేచిపోయాయి. ముళ్ళ కంపలాన్ని చెల్లాచెదురుగా కొట్టుకుపోయాయి. ఈ వర్షం చాలా వరకు నష్టాన్ని కలిగించిందని పలువురు పేర్కొంటున్నారు. జొన్నల కొనుగోలు కేంద్రంలో జొన్నలన్నీ తడిసి ముద్దాయి.

జైనథ్: జైనథ్ ఉమ్మడి మండలంలోని పిప్పర్‌వాడ, మేడిగూడ(ఆర్), జైనథ్‌లోని మార్కెట్ యార్డులో నాఫెడ్ మార్క్‌ఫెడ్ ద్వారా వివిధ సహకారం సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న జొన్న రైతులు బుధవారం కురిసిన అకాల వర్షానికి పడిరాని పాట్లు పడ్డారు. జొన్నల కొనుగోలు కేంద్రంలో రైతులకు సరిపడా బార్దన్ పోతాలు లేక గతనాలుగు రోజులుగా తిండి తిప్పలు లేక పలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ విషయం పై మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌కుమార్‌ను విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం పొలం పనులను చేస్తున్న క్రమంలో రైతులను ఇబ్బందులను పెట్టందని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



బుధవారం ఉదయం కురిసిన చిరుజల్లులకు బోథ్ మార్కెట్ యార్డులో జొన్న పంట బస్తాలపై కప్పి ఉంచిన టార్పలీన్ కవర్లు



తలమడుగు మండల పరిషత్ కార్యాలయంలో నిలిచిన వర్షపు నీరు



సుంకిడి గ్రామంలో కురుస్తున్న అకాల వర్షం



వర్షం కురవడంతో పొలం నుంచి ఇంటికి ఎడ్లబండిపై వస్తున్న రైతు



భూమిపూజ చేస్తున్న ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్

విద్యాభివృద్ధికి కృషి : ఎంపీ గోడం నగేష్

మావల, మే 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల్లో భవనాలు నిర్మించి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎంపీ గోడం నగేష్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బట్టి సవర్గం గ్రామపంచాయతీ పరిధిలోని దుబ్బగూడాలో పాఠశాల భవనంతో పాటు అంగన్‌వాడఈ భవనానికి స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ గతంలో ఇక్కడ పాఠశాలకు భవనం లేక అద్దె భవనంలో తరగతులు జరిగేవ న్నారు. ఇక్కడి విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యను పరిష్కరించాలని లక్ష్యంతో భూమిపూజ చేయడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం విశేషంగా కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సరోజ, బీజేపీ నాయకులు గంగారెడ్డి, రవి రెడ్డి, సతీష్, లక్ష్మన్న, శ్రీనివాస్ రెడ్డి, భూమేష్ నిఖిల్, భీమాసేన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● కుల సంఘాల కృషి అభినందనీయం

ఆదిలాబాద్ అర్బన్: సమాజంలో ఉన్న పేదలను ఉన్నత స్థాయికి తీసుకువచ్చేందుకు కుల సంఘాలు చేస్తున్న కృషి అభినందనీయమని ఎంపీ గోడం నగేష్ అన్నారు. బుధవారం న్యూహౌజింగ్‌బోర్డు కాలనీలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన రెడ్డి వసతి గృహ సముదాయాన్ని ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కలిసి పూజలు చేసి ప్రారంభించారు. ముందుగా రాజబహదూర్ వెంకట్రాం రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడంగేష్ మాట్లాడుతూ తమ సమాజంలోని పేదలను ఆదుకునేలా కుల సంఘాలు చేపట్టే కార్యక్రమాలు ఇతర సంఘాలకు ఆదర్శంగా ఉంటాయన్నారు. రెడ్డి సంఘంలోని పేద విద్యార్థుల కోసం వసతి గృహం ఏర్పాటు చేయడం మంచి పరిణమమని అన్నారు. ఐక్యంగా ఉంటూ సంఘంతో పాటు సమాజంలోని సభ్యుల అభివృద్ధికి పాటు పడాలన్నారు. ఇందులో నాయకులు రత్నాకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలాగే, రెడ్డి సంక్షేమ సంఘ అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లి ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, జోగు రామన్న, డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘ అధ్యక్షుడు నల్ల నారాయణ రెడ్డి, కార్యదర్శి గోపిడి రాంరెడ్డి, ముడుపు ప్రభాకర్ రెడ్డి, చిట్యాల సుహాసిని రెడ్డి, రంగినేని మనిషా, బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, లోక ప్రవీణ్ రెడ్డి, తుమ్మల వెంకట్‌రెడ్డి, కిష్టారెడ్డి, సంఘ సభ్యులు, తదితరులున్నారు.

కురిసిన వాన.. తిరంగా ర్యాలీ వాయిదా

ఉట్నూర్, మే 21(ఆంధ్రజ్యోతి): వేసవి ఎండలతో తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రజలకు బుధవారం సాయంత్రం కురిసిన వాన స్వాంతన ఇచ్చింది. ఎండకాలంలో భూగర్భజలాలు ఇంకిపోయి బోర్లలో నీళ్ల రాకుండా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కూడా ఈ వాన రాకతో బోరుబావుల్లో నీళ్ల వస్తాయని భావిస్తున్నారు. కాగా, బీజేపీ ఆధ్వర్యంలో భారత సైనికులకు సంఘీభావంగా చేపట్టనున్న తిరంగా ర్యాలీ.. అకాలవర్షం కారణంగా నిర్వాహకులు వాయిదా వేశారు. తిరిగి గురువారం సాయంత్రం ఉట్నూర్ పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తామని, వర్షం కారణంగా వాయిదా వేశామని తెలిపారు. రెండు గంటల పాటు కురిసిన గాలివానలకు వాతావరణం చల్లబడిందని ప్రజలు అంటున్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

● ఆదిలాబాద్‌లో జిల్లాలో 34వ వర్ధంతి వేడుకలు ● పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఆదిలాబాద్ అర్బన్, మే 21(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికతకు మార్గదర్శి దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లి ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయం ప్రజాసేవా భవన్‌లో రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి వేడుకలను పార్టీ శ్రేణులతో కలిసి ఘనంగా నిర్వహించారు. అనంతరం రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఆధునిక దృష్టితో భారతదేశానికి నూతన దిశను చూపిన మహనీయుడు రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. కంప్యూటరీకరణ, టెలికాం విప్లవం, యువత అభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థల బలోపేతం, తదితర రంగాల్లో ఆయన చేసిన సంస్కరణలు దేశాభివృద్ధికి బలమైన పునాది వేశాయన్నారు. దేశంలో శాంతి, ఐక్యత, ప్రజాస్వామ్యానికి మద్దతుగా నిలుద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఇందులో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ దిగంబర్ రావు పాటిల్, పార్టీ జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడు శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్, గిమ్మ సంతోష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. యూత్ అధ్యక్షుతు చరణ్‌గౌడ్ ఆధ్వర్యంలో రిమ్స్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

ఉట్నూర్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దివంగత ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో జిల్లా ఆర్టీఏ మెంబర్ దూట రాజేశ్వర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎక్బాల్, తదితరులు పాల్గొన్నారు. అలాగే, హస్నాపూర్‌లో మాజీ ఉప సర్పంచ్ నేదునూరి అశోక్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఇందులో షేక్‌జావిద్, మదన్‌రావు, కిరణ్, కైలాస్, రాందాస్, ఇమ్రాన్, షఫీ, షాదుల్లా, షేక్ జావిద్‌లు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పిస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

బోథ్: బోథ్‌లో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, మాజీ చైర్మన్ రాజు యాదవ్, తదితరులున్నారు.

నేరడిగొండ: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 34వ వర్ధంతిని పురస్కరించుకుని మంత్రి డాక్టర్ సీతక్క ప్రజాభవన్‌లోని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్లా ఐలయ్య, ఖానాపూర్ ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు పటేల్, ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డితో కలిసి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, మే 21(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని బుగ్గరాం గ్రామంలో బుధవారంసేవాలాల్ జగదాంబదేవి ఆలయం వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేరడిగొండ: సీఎం సహాయ నిధి పేదలకు ఒక వరం లాంటిదని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలో గల తన నివాసంలో తాంసి మండలంలోని బండల్ నాగపూర్ గ్రామానికి చెందిన పోతం కృష్ణవేణికి మంజూరైన రూ.12 వేలు, బోథ్ మండల కేంద్రానికి చెందిన ఈశ్వరికి మంజూరైన రూ.22,500 చెక్కులను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, సోను, ప్రతాప్, గులాబ్, తదితరులు ఉన్నారు.

● ఈద్గాను ప్రారంభించిన ఎమ్మెల్యే

గుడిహత్నూర్: మండల కేంద్రం సమీపంలో నూతనంగా నిర్మించిన ఈద్గాను బుధవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి చేయడం తన బాధ్యత అన్నారు. అన్ని కులాల అభివృద్దే బీఆర్ఎస్ పార్టీ ఉద్దేశమన్నారు. అనంతరం మైనార్టీ నాయకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తిరుమల్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సంతోష్ గౌడ్, జాదవ్ రమేష్, జమీల్, రావన్, జమీర్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: ఇటీవల విడుదలైన పదోతరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా స్థానాన్ని దక్కించుకున్న దొంగ్రా గావ్‌కు చెందిన దోమకొండ సుధాకర్ కుమారుడు దోమకొండ శ్రీధర్‌ను మండల పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అభినందించారు.

'ఏజెన్సీ ఎస్సీలకు పహనీలు ఇవ్వాలి'

నార్నూర్ రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజన ఏజెన్సీ ప్రాంత ఎస్సీల సాగు భూములకు పహనీలు ఇవ్వాలని బుధవారం డిప్యూటీ తహసీల్దార్ శ్యాంసుందర్‌కు గెడం నిరంజన్ జిల్లా అధ్యక్షుడు ఆదివాసీ ప్రధాన్ పురోహిత సంఘపరంగా వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ రైతుల పరిస్థితి ఇబ్బందిగా ఉందని, ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యిందని, బ్యాంక్ వారు ఋణాలు ఇవ్వడం లేదని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని అన్నారు. ఆయన వెంట సంతోష్ మానే దళిత జేఏసీ రాష్ట్ర కార్యదర్శి, బాపురావు జాడే, సోమజి దుర్గే, సురేష్, రమేష్ ఉన్నారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న పరీక్షలు

జేల, మే 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలను యూనివర్సిటీ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు బుధవారం పరిశీలించారు. డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని ఇప్పటికీ 6 రోజుల్లో ప్రతీరోజు వచ్చినా.. ఇప్పటి వరకు ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగలేదని, ప్రశాంతంగా కొనసాగుతున్నాయని పరీక్ష కేంద్రం ముఖ్య అధికారి కల్లెం నరేందర్ తెలిపారు. ఆయన వెంట అదనపు అధికారి వినాయక్ రావు, యూనివర్సిటీ అబ్జర్వర్ కార్తీక్ తెలిపారు.

సాహిత్య సమ్మేళనం నుంచి ఆహ్వానం

ఇంద్రవెల్లి, మే 21(ఆంధ్రజ్యోతి): బాల సాహిత్య వికాసం కోసం విశిష్ట సేవలందిస్తూ విద్యార్థులను సాహితీ వేత్తలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న ఇంద్రవెల్లి జిల్లా పరిషత్ పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు అరుణ బట్టువార్‌కు అరుదైన గౌరవం దక్కింది. బాల సాహిత్య వికాసం కోసం నిరంతరం కృషి చేస్తున్న ఆమె సేవలను గుర్తించిన తెలంగాణ సారస్వత పరిషత్తు సత్కారానికి ఆహ్వానం పంపించింది. ఈనెల 25న హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరిషత్తు 82వ స్థాపన దినోత్సవం సందర్భంగా నిర్వహించే బాల సాహిత్య సమ్మేళనంలో సత్కారాలు అందుకోనున్నారు.

అన్నదాత.. అతలాకుతలం!

(5వ పేజీ తరువాయి...)

అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అకాలవర్షాలతో కొనుగోళ్లను తరుచు తాత్కాలికంగా వాయిదా వేయడంతో మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందంటున్నారు. పగలంతా పంటలను ఆరబెట్టడం, సాయంత్రం వేళల్లో పాలిథిన్ కవర్లను కప్పి ఉంచడం నిత్యం రైతులకు ఓ పనిగా మారింది.

తరలించేంత వరకు రైతులదే బాధ్యత

కొనుగోలు చేసిన జొన్న బస్తాలను గోదాంలకు తరలించేంత వరకు రైతులదే బాధ్యత కావడంతో రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. పంటలను అమ్ముకున్న కొనుగోలు కేంద్రాలలోనే ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఏకకాలంలో వరి, జొన్న పంట కొనుగోళ్లను చేపట్టడంతో లారీలు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాంటాలు పూర్తయిన జొన్న బస్తాలను కొనుగోలు కేంద్రాలలోనే నిల్వ చేయడంతో అకాల వర్షాలకు తడిసి పోతున్నాయి. మార్కెట్ యార్డుల్లో కనీస సౌకర్యాలను కల్పించక పోవడంతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. వాతావరణం చల్లబడి మబ్బులు కనిపిస్తే చాలు పాలిథిన్ కవర్లతో కొనుగోలు కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ఇటీవల ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో జొన్న పంటను దొంగలించేందుకు వచ్చిన దుండగులను రైతులు అడ్డుకునే ప్రయత్నం చేయగా.. ఎదురుదాడికి దిగడంతో పలువురు రైతులు తీవ్రంగా గాయపడ్డారు. మార్కెట్‌యార్డుల్లో విశ్రాంతి తీసుకునేందుకు ఎలాంటి వసతులు లేకపోవడంతో పంట కుప్పల పైననే రైతులు కునుకు తీయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలకు జొన్న దిగుబడులు పోటెత్తడంతో మార్కెట్ యార్డులన్నీ జొన్నలతో నిండిపోయాయి. కురుస్తున్న వర్షాలకు తేమ శాతం ఎక్కువగానే రావడంతో కొనుగోలు చేసేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. ఆరబెట్టే అవకాశం లేక, అమ్ముకునే వీలులేక అన్నదాతలు ఆరాట పడుతున్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

ఆదిలాబాద్ టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లోని ప్రధాన కూడళ్లలో తొలగించిన ఆక్రమణలను తిరిగి ఎవరైనా పునరుద్ధరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ జీవన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సివిఎన్ రాజు హెచ్చరించారు. బుధవారం సైతం షాపుల ఎదుట ఫుట్‌పాత్‌లపై వెలసిన ఆక్రమణలను తొలగించారు. ఇకపై ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు చేయొద్దని పేర్కొన్నారు. టీపీవో సుమలత, ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్ ఉన్నారు.

'వీధి వ్యాపారులకు న్యాయం చేయాలి'

ఆదిలాబాద్ టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వీధి వ్యాపారస్తులకు అక్కడే వ్యాపారం చేసుకునేలా వెసులుబాటు కల్పించాలని ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వీధి వ్యాపారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ విషయమై కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా నజీర్ అహ్మద్ మాట్లాడుతూ.. స్థానిక అంబేద్కర్‌చౌక్, శివాజీచౌక్, గాంధీచౌక్‌ల గుండా ఏళ్లుగా వీధి వ్యాపారం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. వారికి ప్రస్తుతం కేటాయించిన స్థలంలో వ్యాపారం ఆశించిన స్థాయిలో జరగదని వాపోయారు. ఓట్ల సమయంలో కనిపించే నేతలు ప్రస్తుతం జాడ లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. వెంటనే వీధి వ్యాపారస్తులకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత జహీర్ రంజాని, శాకత్, పత్తి ముజ్జు, మహ్మద్ రోహిత్ పాల్గొన్నారు.

పసిపాప పాల కోసం ఆవు వితరణ

ఆదిలాబాద్ టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని కొలంగూడకు చెందిన ఆత్రం రాణి బాయి గత నెల ఆడబిడ్డకు జన్మనిచ్చి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. నెల రోజులకే పసిపాప తల్లికి దూరమవ్వడంతో బాధిత కుటుంబీకులు ఆందోళనకు గురయ్యారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పాప పాల కోసం పడే తపనను చూసి రెండు రోజుల్లో ఆవును కొనిస్తానని మాటిచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం ఆవులేగను అందించారు.



కుంటాలలో సహకార సంఘం సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

'ధాన్యం కొనుగోలు చేయండి'

కుంటాల, మే, 21 : (ఆంధజ్యోతి) : అకాల వర్షాల కారణంగా ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయని కొనగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రం కుంటాల సొసైటీ అధికారుల తీరును నిరసిస్తూ బుధవారం కుంటాలకు వచ్చిన కలెక్టర్ అభిలాష అభినవ్, , అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌లకు కుంటాల, వెంకూర్ గ్రామాల రైతులు విన్నవించారు. తమ ధాన్యం, జొన్నలు కొనుగోళ్లలో జాప్యం చేస్తూ సహకారం సంఘం సిబ్బంది రాత్రి వేళల్లో మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన జొన్నలను కొనుగోలు చేస్తున్నారని రైతులు వారి దృష్టికి తీసుకెళ్లారు. మహారాష్ట్ర రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ అసలైన రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడం పట్ల నష్టపోతున్నామని వారు వారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని, అసలైన రైతులకు న్యాయం జరిగేలా చూడాలని, అకాల వర్షాల దృష్ట్యా తమ ధాన్యం తడిసిపోయే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కుంటాలకు సంబంధించిన ధాన్యాన్ని కొనుగోలు చేయక ఇతర ప్రాంతాల ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి సంబంధిత ఆర్డీవో కోమల్ రెడ్డిని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్డీవో కొనుగోలు కేంద్రంలో పరిశీలించి రైతుల ధాన్యం కొనుగోళ్లు వేగవంతం పూర్తి చేయాలని, కొనుగోళ్ల వివరాలు తమకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని, రెండు, మూడు రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేయాలని రైతులతో మాట్లాడి సిబ్బందికి హామీ ఇచ్చారు.

సోన్ మండలంలో అకాల వర్షం

సోన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని వరి ధాన్యం తడిసిపోయింది. ధాన్యం కుప్పల కిందికి నీరు రాకుండా రైతులు నానా తంటాలు పడ్డారు. రైతులు కష్టపడి పండించిన పంట అకాల వర్షానికి తడవడంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

తడిసిన ధాన్యం

సారంగాపూర్, మే21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాలలో బుధవారం ఉదయం కురిసిన అకాల వర్షానికి ధాన్యం పంటలకు నష్టం వాటిల్లిందని రెతులు పేర్కొంటున్నారు. గత వారం రోజుల క్రితం మార్కెట్ యార్డుకు విక్రయించడానికి తీసుకువచ్చిన జొన్న, ధాన్యం తడిసి ముద్దయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పశు పోషణలో మెళకువలు పాటించాలి

భైంసా, మే 21 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు పశు సంతతిని వృద్ధి చేసుకునేందుకు గాను వాటి పోషణలో మెళకువలను పాటించాలని భైంసా పశువైద్యాధికారి డా.విఠల్ సూచించారు. బుధవారం ఇక్కడి పశువైద్యశాలలో ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై సరఫరా చేసిన గడ్డి విత్తనాల పంపిణీ చేపట్టిన సందర్భంగా రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పంటల సాగుతో పాటు పాడి పరిశ్రమ వైపు రైతాంగం దృష్టి పెట్టాలన్నారు. పాల దిగుబడి పెంపు విధానాలపై అవగాహన కల్పించారు. పశు పోషకులు పాటించాల్సిన పలు విధానాలను వివరించారు. భైంసా ప్రాంత రైతాంగానికి 75 శాతం సబ్సిడీపై అందించేందుకు గాను గడ్డి విత్తనాలు సమృద్ధిగా సరఫరా అయ్యాయని,అన్నదాతలు సబ్సిడీ గడ్డి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

రాజకీయ కక్షతోనే కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు

● బీఆర్ఎస్ ముథోల్ సమన్వయ కమిటీ ప్రతినిధి డా. కిరణ్

భైంసా, మే 21 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు బీఆర్ఎస్ పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణతో బెంబేలెత్తిపోతున్న రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ సర్కార్ రాజకీయ కక్షసాధింపు ధోరణి విధానాలతోనే కాళేశ్వరం కమిషన్ ద్వారా కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసిందని ఆ పార్టీ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధి డా.కిరణ్ కోమ్రేవార్ ఆరోపించారు. బుధవారం భైంసాలో నియోజక వర్గ పార్టీ ప్రతినిధులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగడుతుండటంతో జీర్ణించుకోలేని రాష్ట్ర ప్రభుత్వం దిగజారుడు విధానాలన అవలంభిస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వ అవినీతి, అక్రమాలను అడుగడుగున అడ్డుకుంటుండటంతో ఏమి చేయాలో పాలుపోలేని స్థితిలో కక్షసాధింపు ధోరణి విధానాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇందులో బాగమే కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ ద్వారా నోటీసుల జారీ ప్రక్రియ జరిగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణను సస్యశ్యామలం చేసిన కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న కుట్రపూరిత చర్యగా అభివర్ణించారు. ఎన్ని కమిషన్లు వేసిన, నోటీసులు జారీ చేసిన కాలక్రమంలో న్యాయాన్ని గెలిపిస్తాయని, నిజాలు బయటకు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ముథోల్ నాయకులు

● ధాన్యం కొనుగోళ్లలో పూర్తిగా వైఫల్యం

రైతుసర్కార్ అని ప్రగల్భాలు పలికే కాంగ్రెస్ సర్కార్ ధాన్యం కొనుగోళ్లలో పూర్తిగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో చూపిన శ్రద్ధను కొనుగోళ్ల విషయంలో చూపెట్టకపోవడం మూలంగా రైతన్నలు అడుగడుగున కష్టనష్టాల పాలవుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. కొనుగోళ్లు, తూకాల ప్రక్రియల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటం మూలంగా కేంద్రాలన్నీ ధాన్యం నిల్వలతో నిండిపోయి కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. దీనికి తోడు అకాల వర్షాలు బెడదతో ధాన్యం నిల్వలు తడిసిపోతుండటంతో రైతులు అవస్థల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇకనైనా కళ్లబొల్లి కబుర్లు పక్కనపెట్టి, బూటకపు వాగ్దానాలను విడనాడి కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వెల్లడించారు. ఇందులో పార్టీ బాసర, కుంటాల మండలాల అధ్యక్షులు శ్యామ్, పడకంటి దత్తు, భైంసా ప్రతినిధి రావుల పోశెట్టి, సోషల్ మీడియా ఇన్‌చార్జీ పెంట దశరథ్, యువజన విభాగపు ప్రతినిధి రజనీకాంత్‌లు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకి ఘన నివాళులు



రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



భైంసాలో రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నిర్మల్ కల్చరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం డీసీసీ అధ్యక్షుడి క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు నాందేడపు చిన్ను రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. జునైద్ మెమన్, సోమ భీమ్ రెడ్డి, ఎంబడి రాజేశ్వర్, శ్రీనివాస్, భూరాజ్, పోశెట్టి, పూదరి అరవింద్, శ్రీకాంత్, ఖీజర్ పాల్గొన్నారు.

ఐటీఐలో..

స్థానిక రాజీవ్‌గాంధీ ఐటీఐ కాలేజీలో రాజీవ్‌వర్ధంతి ఘనంగా నిర్వహించారు. రాజీవ్ చిత్రపటానికి పూలామాల వేసి ఘనంగా నివాళులర్పించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సమరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు నిఖిల్, హర్షద్, సాయిప్రతా, సజ్జాద్ హుస్సేన్, నవీద్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ సేవలు మరువ లేనివి

భైంసా, మే 21 (ఆంధ్రజ్యోతి): : మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరువ లేనివని భైంసా ఏఎంసీ వైస్ చైర్మెన్ ఫారుఖ్ అహ్మద్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బాశెట్టి రాజన్నలు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. స్వర్గీయ రాజీవ్ గాంధీ దేశంలో ఉత్తమమైన రాజకీయ నాయకుడిలా పేరు ఘటించారని పేర్కొన్నారు. ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో పరిచయం చేసిన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతోనే నేడు దేశం ముందుకెల్తోందన్నారు. యువతకు అన్ని రకాల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కిందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ శ్రేణులు స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కడెంలో..

కడెం, మే 21 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగెల భూషణ్ తెలిపారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం కడెం మండలంలోని మాసాయిపేట గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మల మల్లేష్, నాయకులు సలీం, శంకర్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాలకు టెక్నాలజీని చేర్చారు

ఖానాపూర్, మే 21 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే మారుమూల ప్రాంతాలకు సైతం టెక్నాలజీని చేరవేయడంలో భారత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ కృషి ఎనలేనిదని ఖానాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్దుల్ మాజిద్ అన్నారు. బుధవారం రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డ్ సమీపంలోని రాజీవ్ చౌక్‌లో గల రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడార్ల గంగ నర్సయ్య, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్‌పాషా, సీనియర్ నాయకులు యూసుఫ్‌ఖాన్, తోట సత్యం, మైనార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సలీంఖాన్ పాల్గొన్నారు.

పారదర్శకంగా పోలీసుసిబ్బంది బదిలీ ప్రక్రియ

నిర్మల్ కల్చరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లాలోని పోలీసు సిబ్బంది బదిలీ ప్రక్రియ బుధవారం ఎస్పీ జానకీషర్మిల పారదర్శకంగా నిర్వహించారు. 66 మంది సివిల్, 29 మంది హెడ్ కానిస్టేబుళ్లు, ఆరుగురు ఏఎస్సైలకు బదిలీ ప్రక్రియ సజావుగా జరిగింది. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

శిక్షణ కేంద్రం పరిశీలించిన రాష్ట్ర పరిశీలకుడు

నిర్మల్ కల్చరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని బుధవారం రాష్ట్ర పరిశీలకుడు రామకృష్ణ పరిశీలించారు. విద్యార్థుల్లో అభ్యాసన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. వృత్తిపర సామర్థ్యాలు పెంపొందించుకోవాలన్నారు.

వీడీసీ ఆధ్వర్యంలో ఆత్మ చైర్మన్‌కి సన్మానం

నిర్మల్ రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఆత్మ చైర్మన్‌గా నియమితులైన కోండ్రు రాంరెడ్డి, డైరెక్టర్‌గా ఎనుగందుల భూమేష్‌కి బుధవారం రత్నాపూర్ కాండ్లి వీడీసీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వీడీసీ సభ్యులు ఈర్ల హరికృష్ణ, సాయేందర్, షేక్ మాజిద్, సాయన్న, గ్రామ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ గౌడ్, సెక్రటరీ వీణ, యువకులు పాల్గొన్నారు.

రేషన్‌డీలర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక

దిలావర్‌పూర్, మే 21 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌డీలర్ల సంఘం దిలావర్‌పూర్ మండల కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కస్తూరి చిన్నయ్య (న్యూలోలం), ఉపాధ్యక్షుడిగా పీసరి మధుకర్ (దిలావర్‌పూర్), గౌరవ అధ్యక్షులుగా సాదుల సుభాష్ (దిలావర్‌పూర్), కార్యవర్గ సభ్యులుగా సురేష్ (బన్సపల్లి), అజయ్ (సిర్గాపూర్), ప్రభాకర్ (గుండంపల్లి), సాగర్ (దిలావర్‌పూర్)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని డీలర్లు సన్మానించారు.

గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి



ఖానాపూర్, మే 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పని చేస్తున్న పంచాయతీ సిబ్బందిని వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులను ప్రభుత్వం పర్మినెంట్ చేయడంతో పాటు వేతనాలకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. గ్రామ పంచాయతీ వ్యవస్థ ఏర్పడి 60 ఏళ్ల గడిచినప్పటికీ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందిని ఇంకా పర్మినెంట్ చేయకపోవడం ఎంత వరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ మండల అధ్యక్షులు శేఖర్, ఉపాధ్యక్షులు పోశెట్టి, ప్రధాన కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి నాగారావు, కోశాధికారి స్వామి, తదితరులున్నారు.

బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్

నర్సాపూర్(జి), మే 21 (ఆంధ్రజ్యోతి) : బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ శ్రీకాంత్‌ను మండల నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామయ్య, రాంరెడ్డి, సాగర్, గంగారాం, తదితరులున్నారు.

విద్యార్థులను అభినందించిన ఎంఈవో

ముథోల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గురుకుల విద్యాలయ జూనియర్ కాలేజీలలో ప్రవేశాల కొరకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన మండలంలోని ఆష్టా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను బుధవారం మండల విద్యాధికారి రమణారెడ్డి అభినందించారు.

నిర్మల్ జిల్లాలో వర్షం.. తడిసిన ధాన్యం


తడిసిన వరి ధాన్యాన్ని చూపుతున్న రైతు

ముథోల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన అన్నదాతలకు అడుగడుగునా కష్టాలే ఎదురవుతున్నాయి. ప్రతీ సంవత్సరం ఏదో ఒక రూపంలో అన్నదాత నష్టపోతూనే ఉన్నాడు. జిల్లాలో మంగళవారం రాత్రి, బుధవారం తెల్లవారు జామున వర్షం కురిసింది. ఈ కురిసిన వర్షం కారణంగా రైతులు వరి కొనుగోలు కేంద్రాల్లో కల్లాల్లో ఆరబెట్టిన వరి ధాన్యం తడిసిపోవడంతో రైతన్న ఆందోళన చెందుతున్నాడు. నిర్మల్ జిల్లాలోని బాసరలో 28.2 మిల్లీమీటర్లు, భైంసా 9.2 మిల్లీమీటర్లు, ముథోల్ 26 మిల్లీమీటర్లు, తానూర్ 29.6 మిల్లీమీటర్లు, సారంగాపూర్ 2.2 మిల్లీమీటర్లు, లోకేశ్వరం 17.2 మిల్లీమీటర్లు, లక్ష్మణచాంద 17.2 మిల్లీమీటర్లు, మామడ 7.6 మిల్లీమీటర్లు, ఖానాపూర్ 14. మిల్లీమీటర్లు, పెంబి 1.2 మిల్లీమీటర్లు, నర్సాపూర్ 12.8, దిలావర్‌పూర్ 15.2, నిర్మల్‌లో 11.2 మిల్లీమీటర్లు, నిర్మల్ రూరల్ 10.2 మిల్లీమీటర్లు, సోన్ 16.4 మిల్లీమీటర్లు, కుంటాలలో 4.4 మిల్లీమీటర్లు, కడెం 5.8 మిల్లీమీటర్లు, దస్తురాబాద్‌లో 3.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. కురిసిన వర్షం అన్నదాతను ఆగమాగం చేసింది. చేతికందిన పంటను కల్లాల్లో, వరి కొనుగోలు సెంటర్‌లలో ఉంచిన పంట దిగుబడులను తడిసి పోకుండా కాపాడేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షంలోనే రైతులు తమ దిగుబడి ఉత్పత్తులను కాపాడుకునేందుకు టార్పాలిన్ కవర్లను కప్పారు. బుధవారం తెల్లవారు జామున కురిసిన వాన వర్షాకాలాన్ని తలపించింది.

నిర్మల్ రూరల్ మండలంలో వర్షానికి తడిసిన ధాన్యం

నిర్మల్ రూరల్: మండలంలో బుధవారం తెల్లవారు జామున కురిసిన అకాల వర్షంతో అన్నదాతలు అతలాకుతల మయ్యారు. మండలంలోని కౌట్ల(కే), వెంగ్వాపేట్, రత్నాపూర్ కాండ్లి, న్యూ పోచంపాడ్ తదితర గ్రామాల్లో ధాన్యం వర్షానికి తడిసింది. రైతులు ఆరుగాలాలు కష్టపడి పండించిన పంట అకాల వర్షానికి తడవడంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. పండించిన పంటను నిర్ణీత కాలంలో కొనుగోలు చేయక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఇటీవల కౌట్ల(కే) రైతులు జిల్లా కలెక్టర్‌కు కలిసి తమకు న్యాయం జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు చేసిన వాటికి సరైన సమయంలో లారీలు రాకపోవడంతో తూకం వేసిన ధాన్యంపు బస్తాలు వర్షానికి తడిసిపోయాయి. చేతికి వచ్చిన పంట ఇలా అకాల వర్షాలకు తడిసిపోవడంతో అన్నదాతలు దిగులు చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

కుంటాల: మండలంలో బుధవారం తెల్లవారుజామున అకాల వర్షం కురిసింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఉదయం పూట ఒక్కసారిగి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురియడంతో అప్పటికప్పుడు రైతుల ధాన్యంపై టార్పలిన్ కవర్లు కప్పుకోలేక చాలా మంది రైతుల ధాన్యం తడిసి ముద్దయింది. మరోపక్క బలమైన గాలి వీయడంతో కొంత మంది రైతుల ధాన్యం కుప్పల పై నుండి టార్పలిన్ కవర్లు లేచిపోయి ధాన్యం తడిసిపోయింది. గతవారం రోజుల నుండి ఏదో ఒక సమయంలో అకాల వర్షాలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

భైంసా రూరల్: మండలంలో బుధవారం అకాల వర్షం కురి యడంతో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. ఉదయం కురిసిన వర్షం వలన రైతులు అనేక ఇబ్బందుల పాలయ్యారు. అధికారులు కొనుగోలు కేంద్రాన్ని వేగవంతం చేయాలన్నారు. అదే విధంగా మొలకెత్తిన ధాన్యం, తడిసిన ధాన్యాన్ని తీసుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులకు రైతులు కోరారు.

లోకేశ్వరం : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి వరి కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం మొత్తం తడిసి ముద్దయింది. రైతులు నానా ఇబ్బందులు పడవలసి వచ్చింది. వర్షంతో పాటు ఈదురు గాలి రావడంతో వడ్ల పైన టార్పాలిన్‌లు కప్పిన ఈదురు గాలులకు లేచిపోయా యి. రైతులు మాట్లాడుతూ... అధికారులు ఇప్పటికైనా స్పందించి వరి కొనుగోలు కేంద్రాల నుండి వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరారు.


కౌట్ల(కే)లో తడిసిన వరి ధాన్యాన్ని చూపుతున్న రైతు


సారంగాపూర్ మండలంలో తడిసిన వరి ధాన్యం


బిజ్జూర్ గ్రామంలో తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు


కుంటాలలో కొనుగోలు కేంద్రంలో
టార్పలిన్ కవర్లపై చేరిన వర్షపు నీటిని తొలగిస్తున్న రైతులు

అకాల వర్షానికి అన్నదాత అతలాకుతలం

● పంట కల్లాల్లో తడిసి ముద్దయిన వరి ధాన్యం

ఖానాపూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): అన్నదాత ఆరుగాలం శ్రమించి పండించిన పంటను వరుణుడు మరోసారి తడిసి ముద్దయ్యేలా చేశాడు. బుధవారం తెల్లవారు జామున కురిసిన అకాల వర్షానికి ఖానాపూర్ మండలంలోని పలు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. దీంతో ఇన్నాళ్ల రాత్రనకా, పగలనకా శ్రమించి పండించిన పంటను 45 డిగ్రీల ఎండ లను సైతం లెక్క చేయకుండా ఆరబెట్టుకుంటే తీరా పంట అమ్ముకునే సమ యానికి అకాల వర్షం పంటను తడిపేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి కోతలు పూర్తయిన రైతుల పరిస్థితి ఇలా ఉంటే ఇంకా కోతలు చేపట్టని వ్యవసాయ క్షేత్రాల్లో ఈ అకాల వర్షానికి భూమి తడిసిపోయి హార్వెస్టర్లు సైతం నడవలేని పరిస్థితి తలెత్తిందని చెబుతున్నారు.


ఖానాపూర్ మార్కెట్ యార్డ్‌లో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని వర్షపు నీటి నుంచి తీస్తున్న మహిళ

మరోపక్క వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న నిర్లక్ష్య పూర్తి వైఖరితో ధాన్యం కొనుగోలు నత్తనడకన సాగుతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూలీల కొరత అంటూ, మిల్లర్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ సెంటర్ నిర్వాహకులు రైతుల నుంచి ధాన్యం సేకరించడంలో పెడుతున్న మెలికలతో ప్రస్తుతం ధాన్యం పంట కల్లాల్లోనే ఉండి పోవాల్సిన పరిస్థితి తలెత్తిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండల కేంద్రంలోని వ్యవ సాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో ఖానాపూర్ పీఏసీఎస్ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని ప్రభు త్వం బేషరతుగా కొనుగోలు చేయలని డిమాండ్ చేశారు. కూలీల కొరత పేరిట రైతులను వేధించవద్దని వెంటనే సరిపడా కూలీలను ఏర్పాటు చేయలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి చేస్తున్న దోపిడీని ఇప్పటికైనా ఆపాలని ఆయన కోరారు. వెంటనే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే రైతు లతో కలిసి గురువారం ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఘనంగా వేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం

● భక్తులతో కిటకిటలాడిన బరంపూర్ తిరుమలకొండ


స్వామి వారి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు

తలమడుగు, మే 21 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తల మడుగు మండలం బరంపూర్ కొండపైన స్వయంభుగా వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో పునః నిర్మాణంలో భాగంగా బుధవారం నిర్వహించిన మూడో వార్షి కోత్సవ కార్యక్రమాన్ని ఆలయ అభివృద్ధి కమి టీ గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్ర చరణ మధ్య స్వామి వారి కల్యాణం ఉత్సవం, పంచామృతంతో అభిషేకం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు ముడుపు కేథరేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ బరంపూర్ కొండపై వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయానికి వంద సంవత్సరాల పైగా చరిత్ర ఉందన్నారు. గ్రామస్థుల ఆలయ కమిటీ సభ్యుల భక్తుల సహకారంతో దాదాపు 5 కోట్ల వ్యయంతో ఆలయాన్ని పునర్ నిర్మాణం చేపట్టి తెలంగాణ తిరు పతిగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇందులో ఆలయ కమిటీ అ ధ్య క్షుడు కేదారేశ్వర రెడ్డి, కమిటీ సభ్యులు బర్కు మల్లేష్, మల్లారెడ్డి, నాగ రెడ్డి, రాజు, ప్రతాప్, రమా కాంత్, శ్రీనివాస్, మల్లేష్, వేద పండితులు కళ్యాణ్ కుమార్, స్వస్తిక్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

అర్ధాంతరంగా నిలిచిన కల్యాణ మండప నిర్మాణ పనులు

● మూడు దశాబ్దాలుగా పట్టించుకోని పాలకులు, అధికారులు

ఉట్నూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చెందుతున్న ఉట్నూర్ పట్టణంలో కల్యాణ మండపం కరువు అయిపోవడంతో పెండ్లిలు చేసే పేద ప్రజలకు ఆర్థిక పరిస్థితుల బరువు ఏర్పడుతుంది.పేద ప్రజలకు సైతం ఇంటి ముందు పెళ్ళిళ్ల చేసే స్థలాలు కరువై పోవడంతో ఫంక్షన్ హాల్‌లో పెళ్ళిళ్ల చేయడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. పెళ్ళిళ్ల సీజన్ ఉన్న సమయంలో ఫంక్షన్ హాళ్లకు భారీ డిమాండ్ ఉండడంతో రూ.50వేల నుంచి రూ.లక్షల వరకు చెల్లించాల్సి వస్తుండడంతో ధనవంతులు ఎలాగైనా పెండ్లిళ్ల చేయగలిగిన పేద ప్రజల సైతం అప్పుల భారం మోస్తూ ఇంటి ముందు స్థలాలు లేక ఫంక్షన్ హాల్‌లోనే పెళ్ళిళ్ల చేస్తున్నారు. మరికొంత మంది పెళ్లి కొడుకు వారు తమ తాహతుకు తగ్గట్టుగా ఫంక్షన్‌హాల్‌లోనే పెళ్ళిళ్ల చేయాలని మారం చేస్తుండడంతో తప్పని పరిస్థితుల్లో ఫంక్షన్ హాల్‌లోనే పెళ్ళిళ్ల చేస్తూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

మూడు దశాబ్దాలైనా ముందుకు సాగని పనులు

మూడు దశాబ్దాల క్రితం ఉట్నూర్ మండల కేంద్రంలో నిర్మాణం ప్రారంభించిన కల్యాణ మండపం పనులు ముందుకు సాగక అర్ధాంతరంగా నిలిచి పోయాయి. ఉట్నూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ గ్రౌండ్‌లో కళ్యాణ మండపం నిర్మాణ పనులు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఉన్న రోజులలో సామాన్య పేదల ప్రజలకు అందుబాటులో ఉండే విదంగా కళ్యాణ మండపం మంజూరు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం పోయిన తర్వాత వచ్చిన ప్రభుత్వాలు కాని, ప్రజా ప్రతినిధులు కాని ఏ మాత్రంచొరవ చూపక పోవడంతో ఆర్థాంతరంగా కళ్యాన మండపం పనులు స్లాబు లెవల్‌లోనే నిలిచి పోయింది. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు పనులు ముందుకు సాగలేదు.


తాగుబోతులకు నిలయంగా మారిన అసంపూర్తి భవనం

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

అసంపూర్తిగా నిలిచి పోయిన కళ్యాణ మండపం భవనం అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పగలు, రాత్రులలో తాగుబోతులతో పాటు తిరుగుబోతు అమ్మాయిలు అబ్బాయిలు కూడా ఈ భవనంలో అసాంఘీక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు సైతం పట్టించుకోక పోవడంతో కళ్యాణ మండపం పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండి పోయాయి. ఇప్పటికైనా అధికారంలో ఉన్న ప్రజా ప్రతినిధులు శ్రద్ధ చూపెట్టి కళ్యాణ మండపం నిర్మాణానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పేద వర్గాలకు బాగుంటుంది

● సీపతి లింగాగౌడ్, లక్కారం



మండల పరిషత్ గ్రౌండ్‌లో నిర్మాణం పూర్తికాకుండా అర్ధాంతరంగా ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపం పనులు పూర్తి చేస్తే వివిధ ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మేరకు కృషి చేసి కళ్యాణ మండపం పనులు పూర్తి చేయించాలి.

ప్రజలకు ఉపయోగం..

● జాదవ్ సుమన్‌బాయి, ఉట్నూర్



కళ్యాణ మండపం పనులు పూర్తి చేస్తే పట్టణ ప్రజలకు ఉపయోగంగా ఉంటుంది. ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో పెళ్లిళ్ల చేస్తున్న పేద ప్రజలు అప్పుల పాలవుతున్నారు. కల్యాణ మండపం ఉంటే ఆడ పిల్లల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గుతుంది.


ప్రచారం నిర్వహిస్తున్న ప్రభుత్వ అధ్యాపకులు

ప్రవేశాల పెంపే లక్ష్యంగా గ్రామాల్లో ప్రచారం

● కుభీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలపై అవగాహన

కుభీర్, మే 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాల జూన్ 2 వ తేదీ నుంచి పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో కళాశాలలో ప్రవేశాల సంఖ్య పెంచడానికి ఇటీవల జిల్లా అధికారుల ఆదేశంతో 2024-25 విద్యాసంవత్సరంలో 20 శాతం అధికంగా ప్రవేశాలు చేపట్టాలనే లక్ష్యంతో మండల కేంద్రమైన కుభీర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్యాపకులు మండలంలోని గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సర్కారు కళాశాలల్లో విద్యా విధానం, విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉపకార వేతనాలు, తదితర అంశాలను పదోతరగతి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇంటింటా తిరుగుతూ పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కళాశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను సూచిస్తున్నారు. గత విద్యాసంవత్సరం 2024-25 ప్రథమ సంవత్సరానికి 134 మంది విద్యార్థులు ప్రవేశాలు నమోదు చేసుకున్నారు. ఈ కళాశాల ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులు నిర్వహిస్తున్నారు. మొత్తం 12 మంది రెగ్యులర్ ఆధ్యాపకులు ఒకరు అతిది ఆధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. రానున్న విద్యా సంవత్సరం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా తన వంతు కృషి చేస్తామని ఆధ్యాపకులు హన్మంత్‌రావు, చంద్రశేఖర్, రమేష్, సంపత్, నర్సయ్య, శ్రీనివాస్‌రావు, శివరాజ్, విజయ్‌భాస్కర్, ఉమాదేవి, నరేష్, రమ్య, మాదవిపేర్కొంటున్నారు.



● నాణ్యమైన విద్య అందిస్తాం

సునీల్‌కుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాము. రానున్న 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల సంఖ్య పెంచడానికి ఇప్పటికే ఆధ్యాపకులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. పది ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రభుత్వ కాలేజీలో ప్రవేశాలకు నమోదు చేసుకొని విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తాం.



తొలగిపోయిన ట్రాఫిక్ జామ్ కష్టాలు

ఆదిలాబాద్ పట్టణ వాసులకు ట్రాఫిక్ జామ్ కష్టాలు దూరమయ్యాయి. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో రోడ్లపై ఉన్న దుకాణాలను మున్సిపల్, పోలీసులు అధికారులు తొలగించారు. ఇన్నాళ్ల కిసాన్‌చౌక్ నుంచి గాంధీచౌక్ వరకు రోడ్ల మీదనే దుకాణాలు ఏర్పాటు చేయడంతో తరచు ట్రాఫిక్ జాం అయ్యేది. ద్విచక్ర వాహనం తప్పితే కార్లు, ఆటోలు వంటివి ఆగుతు సాగుతూ వెళ్లేవి. అక్రమణలతో రోడ్డు ఇరుకుగా మారడంతో వీటిని తొలగించాలని పట్టణ వాసులు అనేక ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. తాజాగా అక్రమణలు తొలగించడంతో ట్రాఫిక్ సమస్య దూరం కానుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)


ఫొటో న్యూస్

నాడు తోపుడుబండ్లతో రద్దీగా ఉన్న దృశ్యం





నేడు తోపుడు బండ్లను తొలగించడంతో ట్రాఫిక్ సమస్య లేని దృశ్యం

వేడుక ఏదైనా..
సందర్భం ఎటువంటిదైనా
వివాహ వార్షికోత్సవం
స్వదేశీ, విదేశీయానం
లీగల్ ప్రకటనలు
పదవీ విరమణ
శ్రద్ధాంజలి
జన్మదినం
షష్టిపూర్తి
జయంతి
వర్ధంతి
క్లాసిఫైడ్స్
మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా అతి తక్కువ రేట్లకే శుభాకాంక్షలు తెలియజేయండి
ఆంధ్రజ్యోతి
ప్రకటనల కొరకు సంప్రదించండి
ఆదిలాబాద్: 99854 11291
నిర్మల్ : 80966 77672
యాడ్స్ మేనేజర్ : 99854 11453



ఇక పల్లెల్లోనే న్యాయ పరిష్కారం!

- త్వరలోనే పంచాయతీలకు 'కమ్యూనిటీ మీడియేటర్లు'
- జిల్లాలోని గ్రామాల్లోనే న్యాయ పరిష్కారం దిశగా అడుగులు
- కోర్టులపై కేసుల భారం తగ్గింపునకు ప్రయత్నాలు
- లోక్ అదాలత్‌లలో కేసుల పరిష్కారం కోసమే కొత్త విధానం

నిర్మల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయిలో వివాదాలు, న్యాయపరమైన స్థానిక సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో ఇక నుంచి సామాజిక మధ్యవర్తిత్వ విధానాన్ని త్వరలో అమలు చేసేందుకు సంబంధిత యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. జూన్ 14న అన్ని న్యాయస్థానాల పరిధిలో జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను లక్ష్యంగా చేసుకొని ఈ కమ్యూనిటీ మీడియేషన్ ప్రక్రియను తెరపైకి తెస్తున్నారు. దీని కోసం గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూనిటీ మీడియేటర్లను నియమించనున్నారు. ఓ గ్రామంలో నిజాయితీగా ఉంటూ అందరి చేత మంచివారుగా గుర్తింపు పొందిన రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు సామాజిక కార్యకర్తలు, గ్రామ పెద్దలను కమ్యూనిటీ మీడియేటర్లుగా నియమించనున్నారు. అన్ని పోలీసుస్టేషన్‌ల వారీగా ఈ సామాజిక మధ్యవర్తుల గుర్తింపు ప్రక్రియను చేపట్టనున్నారు. రెండు రోజుల క్రితం దీనికి సంబంధించి జిల్లా ఎస్పీ జానకీషర్మిల జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి చర్చించారు. కమ్యూనిటీ మధ్యవర్తిత్వంపై గ్రామస్థాయిలో న్యాయసాధన సులభంగా సాధించవచ్చని ఎస్పీ జానకీ షర్మిల.. సంబంధిత ఎస్‌హెచ్‌వోలకు సూచించారు. దీనిపై పోలీసు అధికారులు అందరు దృష్టి సారించాలని ఆమె కోరారు. స్థానిక ప్రజలందరినీ న్యాయ పరిష్కార ప్రక్రియలో భాగస్వాములను చేసేందుకే కాకుండా గ్రామాల్లో శాంతియుత, సమగ్ర వాతావరణం ఏర్పడేందుకు కమ్యూనిటీ మీడియేషన్ ఉపయోగపడుతుందని ఎస్పీ వివరించారు.

పకడ్బందీగా కమ్యూనిటీ మీడియేటర్ల ఎంపిక

గ్రామాల్లో నిజాయితీతో ఉంటూ ఇప్పటికే మంచి వ్యక్తులుగా గుర్తింపు పొందిన వారినే కమ్యూనిటీ మీడియేటర్లుగా ఎంపిక చేయనున్నారు. ముఖ్యంగా రిటైర్డ్ టీచర్లు, ఉద్యోగులు, సోషల్‌వర్కర్లు, గ్రామ పెద్దలకు అవకాశం కల్పించనున్నారు. అయితే వీడీసీ వ్యవహారాలలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ వివాదాస్పదులుగా ముద్ర పడిన వారిని కమ్యూనిటీ మీడియేషన్‌కు దూరంగా ఉంచనున్నారు. చిన్నచిన్న కుటుంబ తగాదాలు, స్థానికంగా ఏర్పడే సమస్యల పరిష్కారాలకు ఇక కమ్యూనిటీ మీడియేటర్లు ఉపయోగపడనున్నాయి. కమ్యూనిటీ మీడియేషన్ ద్వారా కేసుల తీవ్రత ఆధారంగానే పోలీసుస్టేషన్లు, కోర్టులను ఆశ్రయించే అవకాశం ఉంటుందే తప్ప స్థానికంగా ఏర్పడే మామూలు వివాదాలన్నీ కమ్యూనిటీ మీడియేషన్ ద్వారానే పరిష్కారానికి నోచుకునే అవకాశం ఉంటుంది.

పల్లెల్లో అవగాహన కార్యక్రమాలు

జిల్లా ఎస్పీ జానకీషర్మిల ఆధ్వర్యంలో కమ్యూనిటీ మీడియేషన్ ప్రక్రియపై విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్‌ల అధికారులతో ఈ ప్రక్రియపై చర్చించారు. కమిటీ మీడియేటర్ల నియామక ప్రక్రియలో స్థానిక ప్రజల అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలని ఎస్పీ సూచించారు. దీని కోసం గానూ పోలీసుస్టేషన్ పరిధిలోని గ్రామ పెద్దలతో ఈ సమావేశాలు ఏర్పాటు చేసి కమ్యూనిటీ మీడియేటర్ల ఏర్పాటు, వారి బాధ్యతలపై వివరించనున్నారు. కమ్యూనిటీ మీడియేటర్ల ఎంపిక విషయంలో వీడీసీల ప్రమేయం లేకుండా చూడనున్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో వీడీసీలపై అనేక రకాల ఆరోపణలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వీడీసీల పాత్ర లేకుండా కేవలం స్థానికులే కమ్యూనిటీ మీడియేటర్లను ఎంపిక చేసే విధంగా కార్యాచరణను రూపొందిస్తున్నారు. ఈ విధానం అన్ని గ్రామాల్లో పకడ్బందీగా అమలైతే ఇక పల్లె పంచాయతీలన్నింటికీ కోర్టుల ప్రమేయం లేకుండా సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.



కమ్యూనిటీ మధ్యవర్తిత్వంపై సమీక్ష జరుపుతున్న జిల్లా ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల



మామడ మండలంలోని కొరిటికల్ గ్రామ పంచాయతీ

ఆర్టీసీ డిపోను ఆకస్మిక తనిఖీ చేసిన ఇన్‌చార్జి ఆర్‌ఎం



ఉద్యోగులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఆర్‌ఎం

నిర్మల్ రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ నిర్మల్ డిపోను బుధవారం ఆదిలాబాద్ రీజియన్ ఇన్‌చార్జి ఆర్‌ఎం ప్రణీత్, డిప్యూటీ ఆర్‌ఎంవో హర్ష ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆదాయ వ్యయంల గురించి ఆరా తీశారు. కండక్టర్, డ్రైవర్ల పనితీరును పరిశీలించారు. పలు ఫైళ్లను తనిఖీ చేశారు. పెళ్లిళ్లకు, శుభాకార్యాలు ఎక్కువ ఉండడం వల్ల బస్సులు ప్రయాణికులకు అనుగుణంగా సమయ పాలనతో నడపాలని సూచించారు. పెళ్లిళ్లకు శుభాకార్యాలకు అద్దె ప్రాతిపదికన బస్సులు ఇవ్వాలని సూచించారు. ఇప్పటి వరకు ఆదిలాబాద్ రీజియన్‌లోనే మొదటి స్థానంలో ఈ డిపో ఉంది. ఇకముందు రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ కే. పండరి, అసిస్టెంట్ మేనేజర్ ఐ. రాజశేఖర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యాపారులకు రూ. 12వేల జరిమానా



దుకాణానికి జరిమానా రసీదు ఇస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సింగిల్ యూస్ ప్లాస్టిక్ అమ్ముతున్న పలువురు వ్యాపారులకు రూ. 12 వేలు జరిమానాలు విధించినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ... పట్టణంలోని ప్రజలు ప్లాస్టిక్ వాడకూడదని, బట్ట సంచులు వాడి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరారు.

దేవి అహల్యాబాయి హోల్కర్ ఆశయాలను అనుసరించాలి



నిర్మల్ రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : దేవి అహల్యాబాయి హోల్కర్ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకల జిల్లా కన్వీనర్ అలివేలు మంగ అన్నారు. బుధవారం పట్టణంలోని దేవరకోట ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి ఆలయ అర్చకులను సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, ఆలయ అర్చకులు, కేంద్ర టెలికాం బోర్డు సభ్యులు బుర్ర రమేష్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి కే. శ్రావణ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షులు రజినీ వైద్య, బీజేపీ సీనియర్ నాయకులు వడ్లకొండ వెంకటపతి, కూచన్‌పెల్లి లత, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మలేషియా బాధితులు



కేటీఆర్‌తో బాధితులు, వారి కుటుంబ సభ్యులు

కడెం, మే 21 (ఆంధ్రజ్యోతి) : కడెం మండలంలోని లింగాపూర్‌కు చెందిన నరేష్, భాస్కర్, శంకర్, రాజేశ్వర్, శ్రీనివాస్, దస్తూరాబాద్ మండలంలోని మున్యాల్‌కు చెందిన రవీందర్ కుటుంబ సభ్యులు బీఆర్‌ఎస్ నేత కేటీఆర్‌ను బుధవారం కలుసుకున్నారు. మలేషియా జైలులో ఉన్న వీరిని ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ చొరవతో మలేషియా దేశ అధికారులతో మాట్లాడి స్వదేశానికి రప్పించిన విషయం విదితమే. తాము స్వదేశానికి వచ్చేందుకు సహకరించిన జాన్సన్ నాయక్, కేటీఆర్‌లను నందినగర్ నివాసంలో బాధితులు కలిశారు. బాధితులు వారి కుటుంబ సభ్యులు తమకు అన్ని విధాలుగా అండగా ఉన్న కేటీఆర్‌కి, జాన్సన్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ముథోల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో త్వరలో విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆసక్తి గల విద్యార్థులు తమ వివరాలు నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు ఉపాధి నైపుణ్యాలను పెంచే లక్ష్యంతో యూఎన్‌ఎక్స్ సంస్థ ఆధ్వర్యంలో అందించే శిక్షణ ఉద్యోగ అవకాశాలను మండల పరిధిలోని ఇంటర్మీడియట్ పూర్తి చేసి 18 నుండి 25 సంవత్సరాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. భవిష్యత్తులో మెరుగైన ఉపాధి అవకాశాలను పొందేందుకు ఈ శిక్షణ దోహద పడుతుందని తెలిపారు. ఈ శిక్షణ 30 రోజులు ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 30వ తేదీలోగా సెల్ నంబర్ 97045501658కి వివరాలు తెలపాలని పేర్కొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలి

- మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ సిందే కపిల్

భైంసా, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మున్సిపాలిటీకి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించుకున్న కబ్జదారులపై చర్యలు చేపట్టాలని భైంసా మున్సిపల్ బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ సిందే కపిల్ అధికారులకు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సంబంధిత విషయంలో మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సిందే కపిల్ మాట్లాడుతూ ప్రభుత్వం రెండు ఎకరాలకు పైగా స్థలాన్ని మున్సిపాలిటీకి కేటాయించగా సంబంధిత స్థలాన్ని మున్సిపల్ మాజీ ప్రజా ప్రతినిధుల కుటుంబీకులు కబ్జ చేసుకున్నారని ఆరోపించారు. అంతేకాకుండా సంబంధిత కబ్జ స్థలాన్ని ప్లాట్లుగా చేసి విక్రయాలు సైతం చేసారని వెల్లడించారు. ఇప్పటికే స్థల ఆక్రమణ విషయాన్ని పూర్తి స్థాయి ఆధారాలతో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకు ఫిర్యాదు చేసినట్లుగా వివరించారు. బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు రాజేష్ కుమార్‌కు సైతం ఫిర్యాదు చేసినట్లుగా పెర్కొన్నారు. అధికారులు స్థల ఆక్రమణ వ్యవహరంపై విచారణ జరిపి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆక్రమణకు గురైన స్థలాన్ని మున్సిపాలిటీకి అప్పచెప్పి కబ్జదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులకు లారీ డ్రైవర్లతో తిప్పలు

నర్సాపూర్(జి), మే 21 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం రవాణా చేయడానికి వచ్చిన లారీ డ్రైవర్ మొండికేయడంతో వడ్లు లోడ్ చేయాలంటే హమాలీలు ఇబ్బందులు పడుతున్నారు. లారీలో లోడ్ చేసిన బస్తాలను సైతం దించి వేయించాడు. జిల్లాలోని రైస్‌మిల్‌కు వెళ్తేనే లోడ్ చేసుకుంటానని లారీ డ్రైవర్‌లారీని మంగళవారం సాయంత్రం నిలిపి వేసి వెళ్లిపోయాడు. లారీ యూనియన్ నాయకులు వచ్చి చెప్పినా కూడా వినకపోవడం విమర్శలకు తావిస్తోంది. బుధవారం సాయంత్రం సన్నరకం ధాన్యం లోడ్ చేసి తీసుకువెళ్లే సమయంలో వర్షం కురియడంతో లారీ ఇక్కడే నిలిచిపోయింది. బుధవారం సాయంత్రం ఏపీఎం సునంద, సీసీ ముత్యం సందర్శించారు. మంగళవారం తూకం వేసిన దొడ్డు రకం ధాన్యం బస్తాలను లారీలో తీసుకువెళ్లాలని రైతులు కోరుతున్నారు.

రైతులు సమీకృత వ్యవసాయం వైపు మళ్లాలి

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు
- మహిళా రైతును అభినందించిన కలెక్టర్
- తరోడా రైతును ఆదర్శంగా తీసుకోవాలని సూచన



కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న మహిళా రైతు



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ముథోల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు సమీకృత వ్యవసాయం వైపు మళ్లాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మండలంలోని తరోడా గ్రామ శివారులో రైతు అర్షియాబేగం సాగు చేస్తున్న సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. రైతుతో మాట్లాడి సమీకృత వ్యవసాయం గురించి, దాని ప్రయోజనలు అనుసరించవలసిన విధానాల గురించి తెలుసుకున్నారు. రైతు తన వ్యవసాయ క్షేత్రంలో చేపల పెంపకం, పశువుల పాక, నాడెపు కంపోస్ట్, ఫారం పండ్, అజోల ఉత్పత్తులను ఐకేపీ, జాతీయ ఉపాధి హామీ పథకం సహకారంతో సాగు చేస్తున్నాడు. ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకొని, రసాయనిక ఎరువులను తగ్గిస్తూ తక్కువ పెట్టుబడులతో ఎక్కువ రాబడి వచ్చే విధంగా సాగు చేస్తున్న మహిళా రైతు దంపతులను కలెక్టర్ అభినందించారు. ప్రతి రైతు తక్కువ వ్యవసాయ భూమిలో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను గడించవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు ముందుకు రావాలని వారికి సైతం ప్రోత్సహిస్తామన్నారు. చేపల పెంపకంతో లాభంతో పాటు భూగర్భ జలాలు వృద్ధి చెందుతున్నాయన్నారు. రెండు గుంటల భూమిలో చేపల పెంపకంతో సంవత్సరంకు సుమారు రూ.4 లక్షల ఆదాయం సంపాదించవచ్చన్నారు. తరోడా రైతు ఉపాధి హామీ పథకంతో పాటు ఐకేపీ నుంచి సుమారు రూ.5 లక్షల రుణంతో అన్ని రకాల పంటలు, కూరగాయలు, పశువులు, చేపల పెంపకం చేస్తూ సక్సెస్ అయ్యాడన్నారు. మిగతా రైతులకు ప్రోత్సహించేందుకు వారిని ఈ సమీకృత క్షేత్రానికి తీసుకువచ్చి అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే మట్టి నమూనా పరీక్ష యంత్రంతో మట్టిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో విజయలక్ష్మి, ఆర్డీవో కోమల్ రెడ్డి, తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో శివకుమార్, ఏపీవో శిరీషారెడ్డి, ఏపీఎం గురుచరణ్, టీఏలు యోగేష్, భాస్కర్‌రెడ్డి, దేవిదాస్, సీసీలు పోశెట్టి, వందేమాతరం, సూర్యకాంత్, రైతులు, తదితరులు ఉన్నారు.

భూ సమస్యల దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ పూర్తి చేయాలి

నిర్మల్ అర్బన్, మే 21 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూ సమస్యల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. భూ భారతి చట్టాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న కుంటల మండలంలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులు విజయవంతంగా ముగియడంతో బుధవారం కలెక్టర్ కుంటాల తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని 16 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా మొత్తం 667 భూ సంబంధిత దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ వెల్లడించారు. మిస్సింగ్ సర్వేనంబర్లు, సాదాబైనామా, పేరు, చిరునామా మార్పులు, తప్పుల సవరణలు, మ్యూటేషన్ వంటి సమస్యలు తదితర అంశాలపై వచ్చిన దరఖాస్తులపై అధికారులు వివరాలను కలెక్టర్‌కు అందజేశారు. పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం సేవలు అందించడంతో పాటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్లు కమల్‌సింగ్, ప్రవీణ్‌కుమార్, ఎజాజ్ అహ్మద్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం.. రోడ్డెక్కిన అన్నదాతలు



ఆందోళనకు దిగిన రైతులతో మాట్లాడుతున్న అధికారులు

కుంటాల, మే, 21 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అర్లి ఎక్స్ రోడ్డు వద్ద భైంసా - నిర్మల్ జాతీయ రహదారిపై లోకేశ్వరం, కుంటాల మండలాల రైతులు ధర్నా బుధవారం నిర్వహించారు. అన్నదాతకు అన్ని కష్టాలే.. ఆరుగాలం కష్టపడి పంటలు పండించడం ఒక లెక్క. అయితే.. పండించిన పంటను విక్రయించుకోవడం సవాల్‌గా మారింది. ఇందుకు నిదర్శనం ప్రస్తుతం రబీసీజన్‌లో రైతులు పండించిన ధాన్యమే. ఒకపక్క ప్రతీరోజు అకాల వర్షాల కారణంగా ప్రతీరోజు సా యంత్రం ఈదురు గాలులు, మెరుపులతో వర్షాలు కురియడంతో ధాన్యం కుప్పలపై ప్రతిరోజు టార్పలిన్‌లు వేయడం, తీయడం ఒక పనిగా మారిందని రైతులు పేర్కొంటున్నారు. కొనుగోళ్లలో జాప్యం తేమ, తరుగు పేరుతో అడ్డగోలుగా కోతలు విధిస్తున్నారని క్వింటాలకు 7 కిలోల నుంచి 8 కిలోల వరకు తాలు తప్ప పేరుతో కోతలు విధిస్తున్నారని పేర్కొంటూ బుధవారం సాయంత్రం కుంటాల మండలంలోని అర్లి ఎక్స్ రోడ్డు వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో అధికసంఖ్యలో రైతులు పాల్గొని రోడ్డుపై బైటాయించారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి ఎలాంటి కోతలు లేకుండా తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత రెండు రోజు లు నుంచి అకాల వర్షాలు కురుస్తున్నందున కల్లాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయని, తక్షణమే కొనుగోళ్లు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. ఇష్టారీతిన కోతలు విధించకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ రాస్తా రోకోతో రోడ్డుకు ఇరువైపులా కిలోమీటర్ల వాహనాలు నిలిచిపోయాయి. ఈ ధర్నాకు బీఆర్‌ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు కిరణ్ కొమ్రేవార్, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు పెంట దశరథ్, నర్సాపూర్, కుంటాల, బాసర మండలాల అధ్యక్షులు పడకంటి దత్తు, శ్యామ్, సుధాన్, గ్రీన్ చానల్ అధ్యక్షులు అశోక్ రాథోడ్, అనిల్, రజనీకాంత్, రావుల పోశెట్టి తదితరులు పాల్గొని రాస్తా రోకోకు మద్దతు పలికారు. కొనుగోళ్లు వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి మిల్లర్లకు తొత్తుగా మారి రైతుల ధాన్యం ఇష్టారీతిన కోతలు విధిస్తున్నారన్నారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, నర్సాపూర్ తహసీల్దార్ శ్రీకాంత్, సీఐ గోపినాథ్, నిర్మల్ సీఐ లింబాద్రి సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి రెండు రోజుల్లో కొనుగోళ్లు వేగవంతం చేసి కేంద్రాల్లోని ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి వెనుదిరిగారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



మృతి చెందిన ఆవు

ముథోల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తరోడా గ్రామానికి చెందిన సయ్యద్ ముజీబ్ అనే రైతుకు సంబంధించిన ఆవు బుధవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. బాధిత రైతు కథనం ప్రకారం ఆవు మేస్తుండగా గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తగిలి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిందని తెలిపారు. ఆవు విలువ సుమారు రూ.35 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

పాంగ్రి గ్రామంలో..



మృతి చెందిన ఆవు

భైంసా రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాంగ్రి గ్రామంలో బుధవారం రైతు గాదేవార్ అడెల్లుకు చెందిన ఆవు విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి చెందింది. విద్యుత్ స్తంభం వద్ద షాక్ వచ్చి ఈ ప్రమాదం చోటు చేసుకుందని, ఆవు విలువ రూ.75 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం తరుపున పరిహారం అందించాలని రైతు కోరారు. పశు వైద్యాధికారి విఠల్ పోస్టుమార్టం నిర్వహించి, ప్రభుత్వం తరుపున సహాయం అందించేందుకు తగుచర్యలు తీసుకుంటామని తెలిపారు.

తహసీల్దార్ ఎదుట ఇద్దరి బైండోవర్



ఇద్దరు వ్యక్తులను తహసీల్దార్ ముందు ప్రవేశపెట్టిన దృశ్యం

నిర్మల్ రూరల్, మే 21 (ఆంధ్రజ్యోతి) : గంజాయిని సేవించడం, విక్రయిస్తున్నారని అనుమానంతో ఇద్దరు వ్యక్తులను రూరల్ తహసీల్దార్ ముందర బైండోవర్ చేసినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని విశ్వనాథ్‌పేట్ వద్ద ఇద్దరు వ్యక్తులు గంజాయి అమ్ముతున్నారని సమాచారం రాగా అక్కడికి వెళ్లగా దిలావర్‌పూర్ మండలంలోని గుండంపల్లి గ్రామానికి చెందిన సత్యపోలు యోగేష్, భైంసా పట్టణంలోని పురాణ బజార్‌కు చెందిన షేక్ కైఫ్ వద్ద ఎటువంటి గంజాయి దొరకలేదు. కానీ వారు భవిష్యత్తులో గంజాయిని సేవించడం లేదా విక్రయిస్తారని అనుమానంతో రూరల్ తహసీల్దార్ ముందర బైండోవర్ చేయడం జరిగిందని తెలిపారు. వారు నిబంధనలను అతిక్రమిస్తే వారికి ఒక లక్ష రూపాయల జరిమానా లేదా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.